andhrajyothy.com

ఆంధ్రజ్యోతి




ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

శనివారం 30 ఆగస్టు 2025





అసెంబ్లీలో.. గళమెత్తండి

జిల్లాలో నెలకొన్న.. ప్రధాన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళమెత్తాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా అంతా అతలాకుతలమయ్యింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుకుంటున్నారు.ఇప్పటికే ఎమ్మెల్యేలు, అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అయితే పరామర్శలు కాదు సరిపడ పరిహారం ఇవ్వాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

- జిల్లాలో ఇటీవల భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం
- ప్రభుత్వ సహాయం పైనే రైతుల ఆశలు
- రెండు సంవత్సరాలు అయినా.. జిల్లా ప్రాజెక్టులపై ఊసెత్తని రాష్ట్ర సర్కారు
- నిధుల కొరతతో ఎక్కడి సమస్యలు అక్కడే
- నేటి రాష్ట్ర శాసనసభ సమావేశాలపై సర్వత్రా ఆసక్తి

ఆదిలాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 20 వేలకు పైగా ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. త్వరలోనే అధికారులు ప్రభుత్వానికి పంట నష్టంపై పూర్తిస్థాయి నివేదికను అందించనున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎటు చూసిన వరదలు, నేలపాలైన పంటలు, కోతకు గురైన రోడ్లు, కల్వర్టులే కనిపిస్తున్నాయి. శనివారం రాష్ట్ర శాసన సభ సమావేశాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా సమస్యలను ప్రస్తావించి పరిష్కారం చూపించాల్సిన బాధ్యత జిల్లా ఎమ్మెల్యేలపై ఉందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

రూ.25 వేల పరిహారానికి డిమాండ్

వర్షాలు, వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న పంటలకు ఎకరాన రూ.25వేల నష్ట పరిహారాన్ని చెల్లించాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఎకరాన రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడులు పెట్టి నష్టపోయారు. అంతేకాకుండా గతంలో మాదిరిగా ఎకరాన రూ.10 వేలు చెల్లిస్తే ఏమూలన సరిపోదంటూ రైతులు వాపోతున్నారు. పంటల బీమా సౌకర్యం ఉంటే ఇంతా ఇబ్బంది ఉండేది కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే జిల్లాలో ప్రధానంగా పత్తి, సోయా, కంది పంటలకే ఎక్కువగా నష్టం వాటిల్లింది. అయితే ఎలాంటి నిబంధనలను పరిగణలోకి తీసుకోకుండా నష్టపోయిన ప్రతీ రైతుతో పాటు కౌలు రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే జిల్లాలో యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. అవసరమైన మేరకు యూరియాను సరఫరా చేసి రైతులను

(తరువాయి 6వ పేజీలో....)

ఉట్నూర్‌లో యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి

: వెడ్మబొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే



ఉట్నూర్ మండల కేంద్రంలో యూనివర్సిటీని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రతిరైతుకు నష్ట పరిహారం అందించి ఆదుకుంటాం. తెగిపోయిన రోడ్లు, కల్వర్టుల మరమ్మత్తుల కోసం నిధుల మంజూరుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. అధికారులతో సమీక్షా సమావేశాలను నిర్వహిస్తూ జరిగిన నష్టంపై నివేదికను రూపొందిస్తున్నాం. మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్డు మార్గాలను వేసేందుకు అటవీ అనుమతులను తీసుకుంటాం.

ఎకరా రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలి

: అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే



వర్షాలు, వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారంగా ఎకరాన రూ.25 వేలను చెల్లించాలి. రూ.10 వేలు చెల్లిస్తామంటే ఊరుకునేది లేదు. ఫసల్ బీమాను అమలు చేసి ఉంటే రైతులు నష్టపోయేది కాదు. ఇప్పటికే మూడు ఎత్తిపోతల పథకాలకు అవసరమైన భూ సేకరణకు సర్వే పనులను పూర్తి చేశాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసే విధంగా ఒత్తిడి తీసుకొస్తా. బోథ్ రెవెన్యూ డివిజన్‌పై ప్రభుత్వం ఊసేత్తడమే లేదు. ఇప్పటికే అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావించాం. ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తా.

ఫసల్ బీమా ఉంటే భారం పడేది కాదు

: పాయల శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే



కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకంలో చేరడం లేదు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఏమూలాన సరిపోవడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఫసల్ బీమా ఉంటే ప్రభుత్వంపై భారం పడేది కాదు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరా రూ.50 వేల పరిహారాన్ని చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరతాం. కోర్టా-చనకా బ్యారేజీ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తా.

ఎమ్మెల్యేగా ఎందుకు గెలిచామా అనిపిస్తుంది?

: కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే



ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నయా పైసా ఇవ్వడం లేదు. ఎమ్మెల్యేగా ఎందుకు గెలిచామా? అనిపిస్తుంది. కనీసం సీడీఎఫ్, ఎస్‌డీఎఫ్, సింగరేణి నిధులను ఇవ్వడం లేదు. అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్లు లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఏజెన్సీలో వైద్యం పూర్తిగా గాడి తప్పుతుంది. అసెంబ్లీలో ప్రస్తావించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈసారి వర్షాలు, వరదలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయినా ప్రభుత్వం నష్ట పరిహారం ఇస్తుందో? లేదో? అర్థం కావడం లేదు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

పంచాయతీ ఎన్నికల సందడి షురూ

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వార్డుల వారీగా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు ప్రచురణపై అవగాహన కల్పించారు. ఈనెల 28 న ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురించడం జరిగిందని, జాబితాలో ఏమైన అభ్యంతరాలు ఉంటే.. ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎంపీడీవో కార్యాలయంలో అభ్యంతరాలను తెలపాలన్నారు. అభ్యంతరాలను స్వీకరించిన ఎంపీడీవోలు పరిశీలించి తగు సవరణలు చేసి తుది జాబితా ప్రచురణ జై జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల జాబితా కలెక్టర్‌కు ఆమోదం కోసం సమర్పించాలని అన్నారు. సెప్టెంబరు 2వ తేదీన ఓటర్లు, పోలింగ్ తుది ముసాయిదా జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో ప్రచురించబడుతుందని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఈ నెల 30న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ఆర్డీవో స్రవంతి, డీపీం రమేష్, డీఎల్‌పీం ఫణీంద్ర, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహం అందించాలి

ఆదిలాబాద్ టౌన్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం డీసీసీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన బ్యాంకుల వారీగా పీఎంఎఫ్‌ఎంఈ, పీఎంఈజీపీ, ఎన్‌ఎల్‌ఎం, పీఎం విశ్వకర్మ, కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్(సీఐజీ) పథకాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అగ్రికల్చర్ సెక్టర్, అగ్రి అన్సీలయరీలకు సంబంధించి రూ.1079.22 కోట్లు మొదటి త్రైమాసిక కాలంలో మంజూరు చేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పూర్తయిన యూనిట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న యూనిట్లకు గల కారణాలను బ్యాంకుల వారీగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న యూనిట్ల సమస్యలను సత్వరమే పరిష్కరించి, రుణాలు మంజూరు చేయాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్‌లో కొత్త తరహా లోన్‌లు ఇవ్వాలన్నారు. జొన్నలు అధికంగా లభిస్తాయి కాబట్టి జొన్నలతో తయారయ్యే యూనిట్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. మహిళా సంఘాలను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలన్నారు. ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్ర, ఆర్‌బీఐ ఎల్‌డీఓ ఎస్.రాములు, ఎల్‌డీఎం ఉత్పల్ కుమార్ దామ్, ఇండస్ట్రియల్ జీఎం పద్మభూషణ రాజు, డీఆర్‌డీఓ రాథోడ్ రవీందర్, డీఎంసీ శ్రీనివాస్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ అధికారి మనోహర్, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీధర్, నాబార్డ్ అధికారులు, జిల్లా అధికారులు, బ్యాంకు మేనేజర్స్, సీఎఫ్‌ఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టీఏ చెక్‌పోస్ట్ సేవలను వినియోగించుకోవాలి

ఆదిలాబాద్ టౌన్: రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్టీఏ చెక్ పోస్టు సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ రాజర్షిషా ఒక ప్రకటనలో తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఆర్‌ఏఎన్‌ఎస్‌పీంఆర్‌టీ.టీఈఎల్‌ఏఎన్‌జీఏఎన్‌ఏ.జీవీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా సేవలను పొందవచ్చని, వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ సర్వీసెస్‌పై క్లిక్ చేసి, చెక్‌పోస్ట్‌లో అందించే టెంపరరీ పర్మిట్, వాలంటరీ టాక్స్, స్పెషల్ పర్మిట్ సేవలను పొందవచ్చన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

సమస్యల సమాచారాన్ని సేకరించాలి

ఉట్నూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, పంటలు, డ్రైనేజీలు, స్కూల్ గోడల పైకప్పులు, కరెంట్ స్తంబాల నష్టాలను గుర్తించి యుద్ధ ప్రాతిపాదికన సమస్యల సమాచారాన్ని సేకరించి పనులు చేపట్టాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో వివిధ శాఖల అధికారులకు సూచనలు చేశారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రజలకు ఇబ్బందులు కాలేకుండా పనులను శరవేగంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో మరియు నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు శాఖ బందోబస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందులో సీఐ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల కృషి అభినందనీయం : ఎస్పీ

ఉట్నూర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని ఎంకా కాలనీకి చెందిన భార్యభర్తలు ఇప్పరి ప్రహ్లాద్, శకుంతలు పొలం పనుల నిమిత్తం వెళ్లగా భారీ వర్షాల కారణంగా వాగు ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఉట్నూర్ ఎస్సై ప్రవీణ్, ఏఎస్సై రామయ్య, కానిస్టేబుల్ అశోక్, రమేష్, జ్ఞానేశ్వర్లు, జిల్లా ఫైర్ అధికారుల సహకారంతో సంయుక్తంగా వారిని కాపాడి ఒడ్డుకు చేర్చడంతో ఉట్నూర్ పోలీసుల కృషిని ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం అభినందించారు. గురువారం ఉట్నూర్ మండలంలో భారీ వర్షాలతో సతమతమవుతున్న సమయంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండడంతో పాటు వారిని సురక్షితంగా కాపాడి ఇంటికి చేర్చడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు.

తక్షణ ప్రవేశాలకు దరఖాస్తులు

గుడిహత్నూర్ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీటను భర్తీ చేయడానికి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అరే శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతితో పాటు ఇంటర్ ఫస్టియర్ ఎంఈసీ, సిఇసిలో ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు శనివారం ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రీడా నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలి

- ఎంపీ గోడం నగేష్, కలెక్టర్ రాజర్షి షా
- ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళి
- జిల్లావ్యాప్తంగా ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): క్రీడా నైపుణ్యాలను మెరుగు పరుచుకుంటూ ఉన్నతంగా ఎదగాలని ఎంపీ గోడం నగేష్, కలెక్టర్ రాజర్షిషా సూచించారు. హాకీ మంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని స్థానిక టీటీడీసీలో నిర్వహించారు. ముందుగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీటీడీసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కాగా కలెక్టర్ స్పోర్ట్స్ స్కూల్‌కు టీవీని విరాళంగా అందించారు. అనంతరం ఎంపీ, కలెక్టర్‌లు సంసద్ ఖేలో మహోత్సవ్ వెబ్ సైట్‌ను ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఇటీవల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారికి మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా ఎంపీ నగేష్, కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ... జట్టుగా ఏర్పడి క్రమశిక్షణతో ఉంటూ ఆటోల్లో గెలుపే లక్ష్యంగా సాగాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటి జిల్లాకు పేరు తేవాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. డీవైఎస్‌ఓ జక్కుల శ్రీనివాస్, గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి పాల్గొన్నారు.



ఉట్నూర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

విద్యతో పాటుగా క్రీడల్లో రాణించాలి

ఉట్నూర్: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగుభాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా మేజర్ ధ్యాన్‌చంద్, తెలుగు భాష దినోత్సవ సందర్భంగా గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాటాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సాయిప్రసాద్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ నర్సింగ్‌రావ్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అనిత, తదితరులు పాల్గొన్నారు.



బోథ్‌లో క్రీడాకారుడు మేజర్ ధ్యానచంద్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయుల నివాళి

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

బోథ్: సోనాల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడ దినోత్సవం పురస్కరించుకొని ధ్యాన్‌చంద్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు సచిన్ దేశ్‌ముఖ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని తెలంగాణ గిరిజన సంక్షేమం రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల(బాలికల) బుగ్గరం(బి) ప్రాంగణంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ కృష్ణవేణి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ స్థాయిలో బంగారు. కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులను ఘనంగా సన్మానించారు.



భీంరావు చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఐటీడీఏ ఏపీవో జనరల్ దామోదర స్వామి, ఆదివాసీ గిరిజన నాయకులు

కొట్నాక భీంరావుకు ఘన నివాళి

ఉట్నూర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటిడిఏ ప్రధాన కార్యాలయం సమీపంలో ఉన్న కోట్నాక భీమ్రావు చౌక్ వద్ద తొలి ఉమ్మడి రాష్ట్ర గిరిజన విద్యా శాఖ మంత్రి వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐటిడిఏ ఏపివో ఇన్‌చార్జి(జనరల్) దామోదర స్వామి భీమ్రావు చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులుఅర్పించారు. రాజ్ గోండు సేవాసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషం రావు, జిల్లా గోండ్వానా పంచాయతీ అధ్యక్షులు మెస్రం దుర్గు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: కోట్నాక్ భీంరావ్ 23వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఇందులో తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు, జిల్లా కోశాధికారి కోట్నాక్ బారిక్ రావ్, ఆదివాసీ సంఘాల నాయకులు, తదితరులున్నారు.



బోథ్ ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల సామగ్రి

వేగంగా స్థానిక సంస్థల ఎన్నికల పనులు

- ఎంపీడీవో కార్యాలయానికి ఎన్నికల సామగ్రి

బోథ్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు గాను ప్రభుత్వం ఎన్నికలకు సంబంధించిన పనులను వేగవంతంగా చేపడుతుంది. ఇప్పటికే గ్రామాలలో ఓటర్ జాబితా ప్రదర్శనతో పాటు ఓటర్ జాబితాలో తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు కోరుతున్నారు. అంతేగాక గ్రామాలతో పాటు మండల కేంద్రంలో గ్రామాల వారీగా వివిధ రాజకీయ పక్షాల వారితో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఎన్నికలకు సంబంధించిన సామగ్రి పూర్తిస్థాయిలో మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుంది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నామంటూ ప్రభుత్వం ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాలను పూర్తి చేస్తుంది. అయితే ఎన్నికల బరిలో దిగే వారు మాత్రం రిజర్వేషన్లు ఏ విధంగా ఉంటాయోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రిజర్వేషన్ల ప్రకటన వెలువడిన తర్వాత ఎన్నికల వేడి రాజుకుంటుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.



వినాయక నవరాత్రి ఉత్సవాల సందడి

- జిల్లాలో గణనాథుల ప్రతిమలకు ప్రత్యేక పూజలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందడి నెలకొంది. విభిన్న రూపాల్లో గణ నాథుడిని ప్రతిష్ఠించిన భక్తజనం ప్రత్యేక పూజలతో కొలుస్తున్నారు. వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అధ్యాత్మిక కార్యక్రమాలతో కోలాహల వాతావరణం నెలకుంటోంది. ఇందులో భాగంగానే శుక్రవారం స్థానిక మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. తమ కుటుంబాలను చల్లగా చూడమని ప్రత్యేక పూజలతో కొలిచారు. పండితుల సూచనలకు అనుగుణంగా కుంకుమార్చన జరిపారు. మరోవైపు స్థానిక టీచర్స్ కాలనీలోని గణేష్ రెసిడెన్సీ లో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద మహిళలు సామూహిక కుంకుమార్చన జరిపారు. పండితులు కుంకుమార్చన ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరిస్తూ పూజలు చేయించారు. అపార్ట్‌మెంట్‌కు చెందిన మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు జరపడంతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

◄ గణేషుడిని దర్శించుకున్న ఎస్పీ అఖిల్ మహాజన్

కుమార్ జనతా గణేష్ మండలి వద్ద ఎస్పీ పూజలు

ఆదిలాబాద్ టౌన్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని అతి పెద్ద వినాయకుడిగా పేరు గాంచిన కుమార్ జనతా గణేష్ మండలిని ఎస్పీ అఖిల్ మహాజన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహకులు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం వేద పండితుల

మరిన్ని వివరాలు 6లో...



మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన

వినాయక నవరాత్రి ఉత్సవాల సందడి

(5వ పేజీ తరువాయి...)

మంత్రోచ్చారణల నడుమ ఎస్పీ ప్రత్యేక పూజలు జరిపారు.

● గణనాథుడికి కంది మౌనా శ్రీనివాస రెడ్డి పూజలు



వినాయకుడికి పూజలు చేస్తున్న కంది మౌన శ్రీనివాస రెడ్డి

ఆదిలాబాద్ టౌన్: జిల్లాలో వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు యాల్లోయం ప్రజా సేవాభవన్‌లో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి దర్శించుకున్నారు. గణపతి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం గణనాయకునికి హారతితో పాటు నైవేద్యాలు సమర్పించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆమె వినాయకుడిని ప్రార్థించారు.

మావల: గణ నాథుడి ఆశీస్సులతో ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మావల మండల కేంద్రంలోని ఈశ్వర్ గణేష్ మండలి వారిచే ప్రతిష్ఠించిన గణనాథుడికి కుటుంబ సభ్యులతో కలిసి పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి ఆయన సోదరులు ప్రశాంత్ రెడ్డి ఇరువురు దంపతులు స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి, భారీ గరిక మాలతో స్వామివారిని అలంకరించారు.

ఘనంగా సాఠే జయంతి

ఉట్నూర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కవి, సామ్రాట్ అన్నాబాహు సాఠే జయంతి కార్యక్రమాన్ని మండలంలోని షాంపూర్‌లో అన్న బాబు సాఠే కమిటీ సభ్యులఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భాజా భజంత్రీలతో మంగళ హారతులు పట్టుకొని మహిళలతో కలిసి కమిటీ సభ్యులు గ్రామంలో ర్యాలీ ద్వారా వచ్చి అన్న బహు సాఠే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధ్యక్షుడు రాందాస్, ప్రధాన కార్యదర్శి ప్రహల్లాద, మాజీ వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, మాజీ సర్పంచ్ మల్లిక శంకర్, మాజీ ఉప సర్పంచ్ కేశవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన చైర్మన్

భీంపూర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిపాని, పిప్పల్కోటిలో శుక్రవారం ఆదిలాబాద్ డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. అనంతరం వరదకు నష్టపోయిన ఇళ్లని సందర్శించారు. తాంసి మాజీ ఎంపీపీ సురకుంటి శ్రీధర్ రెడ్డి, పార్టీ జిల్లా నాయకుడు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, అకిటి అశోక్ రెడ్డి, సరసన అమర్ రెడ్డి, రేణుకుంట్ల శ్రీనివాస్, తదితరులున్నారు.

అబాస్ హాజరు విధానాన్ని రద్దు చేయాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అబాస్ హాజరు విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ముందుగా ర్యాలీగా తరలివచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీయూఎం అండ్ హెచ్ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్ కుమార్ మాట్లాడుతూ.. ఏబీహెచ్ఏఎస్ అటెండెన్స్‌తో వేతనాల్లో కోత విధించే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. 104 ఉద్యోగులకు ఐదు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలన్నారు.

సమాజంలో ఉద్యోగుల పాత్ర కీలకం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైనదని, తమ వృత్తిని బాధ్యతగా నిర్వర్తిస్తూ మరింత ఉన్నతంగా ఎదగాలని మాదిగ జాగృతి సంఘం జిల్లా అధ్యక్షులు అన్నెల ఆడెల్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో మాదిగ జాగృతి సంఘం సమావేశాన్ని నిర్వహించారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గట్టయ్య, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, రిటైర్డ్ టీచర్ రాజేశుడు, ఎంజేఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి నాతరి రమేష్, ఎంజేఎస్ జిల్లా బాధ్యులు, తదితరులున్నారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

గుడిహత్నూర్ రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల తుది ఓటరు జాబితా ఆయా గ్రామాల్లో ప్రదర్శించిన నేపథ్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మాణిక్ ప్రభు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బోథ్: బోథ్ మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్ తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరు కావాలన్నారు.

కస్తూర్బా పాఠశాలలో స్పాట్ అడ్మిషన్‌లు

బోథ్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలో ఇంటర్మీడియట్ తో పాటు వివిధ తరగతులలో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వలిత ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 20 బైపీసీలో 5, ఆరు, ఏడు ఎనిమిది తరగతులలో 10 సీట్లు 9వ తరగతిలో ఐదు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 30న స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 8500254190 లేదా 9505774830 నెంబర్ సంప్రదించాలన్నారు.

అంతా అతలాకుతలం..

తాంసి రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గడిచిన రెండు రోజుల నుంచి మండలంలో కురుస్తున్న భారీ వర్షానికి అంతా అతలాకుతలమైంది. మండల కేంద్రంతో పాటు మండలంలోని చాలా గ్రామాలలో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వాగులు, వంకలు, చెరువులతో పాటు ప్రాజెక్టు సైతం పొంగిపొర్లింది. దీంతో వరద నీరు పంట పొలాల్లోకి భారీగా వచ్చి చేరింది. పత్తి పంట అంతా విల్టు తెగుళ్ల సోకి తీవ్ర నష్టాన్ని కలిగించిందని రైతులు అంటున్నారు. కప్పర్ల, తాంసి, జామిడీ, పున్నారి, హస్నాపూర్ గ్రామాలలో పలు పూరి గుడిసెలు కూడా నీటిమట్టమయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



ఇంకా పత్తి పొలంలో నిల్వ ఉన్న వరద నీరు

బాధితులు, ఫిర్యాదుదారులతో
మర్యాదగా ప్రవర్తించాలి

● ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్
● సిరికొండ పోలీస్ స్టేషన్‌లో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ
● స్థానిక సిబ్బందికి పలు సూచనలు



సిబ్బందిని కేసుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ



స్టేషన్‌లో తనిఖీల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తూ..

సిరికొండ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను విన్నవించేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం ఇచ్చోడ సర్కిల్ పరిధిలోని సిరికొండ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఫింగర్ ప్రింట్ పరికరం ద్వారా తనిఖీలు నిర్వహించాలని, తద్వారా దొంగతనాలను, నేరాలను అరికట్టేందుకు ఈ చర్యలు కీలకమవుతాయన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ముఖ్యంగా మండల పరిధిలో నేరాలు, అల్లర్లను ప్రోత్సహించే విధంగా ఉన్నటువంటి గుడుంబా తయారీదారులపై అవసరమైతే బైండోవర్ కేసులు నమోదు చేస్తూ, కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బంది పనితీరు, నమోదు చేయబడిన కేసుల్లో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ప్రజలతో, ఫిర్యాదుదారులతో ఎలా ప్రవర్తిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాలు, తదితర అంశాలను ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ లో ఉన్న వాహనాల కేసుల వివరాలను, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ కు సంబంధించిన సమస్యలు, ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు, ఫిర్యాదులు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, అక్రమ రవాణా, మత్తు పదార్థాలు సేవించడం, అసాంఘిక కార్యకలాపాల వంటి వాటిపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్సై పూజ, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాషను గౌరవించడం అందరి బాధ్యత

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఇచ్చోడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మాతృభాషలో మాట్లాడడం మన తెలుగు సంస్కృతికి గౌరవం, గర్వకారణమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన గిడుగు రామ్మూర్తి జయంతి మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు వెలుగు జిలుగులు విరజిమ్మిన తెలుగు భాష నేడు పరభాషా వ్యామోహంతో మబ్బులు కమ్మిందని అన్నారు. అధ్యాపకులు సరస్వతి, మురళి, విజయ్‌కుమార్, దయాకర్, సుభాష్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: మండలంలోని సాలెవాడకే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గిడుగు రామ్మూర్తి జయంతి పురస్కరించుకుని తెలుగు భాష దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడికని ఘనంగా శాలువాతో సన్మానించారు .ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్ రవికుమార్ మాట్లాడుతూ గిడుగు వెంటరామమూర్తి పంతులు 29 ఆగస్టు 1863 పార్వతీపురంలో జన్మించారని తల్లి రాజ్యలక్ష్మమ్మ తండ్రి వెంకట అప్పయ్యల పుత్రులు గిడుగు రామ్మూర్తి చిన్నప్పటి నుంచే చాలా తెలివితేటలు ప్రదర్శించేవారన్నారు. వీరు తెలుగు సంస్కృతులు ఇంగ్లీషు జర్మన్ వంటి భాషల్లో పాండిత్యం సంపాదించారన్నారు. తనకిష్టమైన తెలుగుభాషను ప్రజలకు సులభంగా అందించాలని సంకల్పం కలిగించారన్నారు. ఈయన ఉపాధ్యాయ వృత్తిని చిన్న వయసులోనే ప్రారంభించారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు మనోజ్‌రెడ్డి, శ్రీధర్,గౌతమ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దినేష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్: తెలుగు భాష అభివృద్ధికి మాతృభాష పరిరక్షణ కోసం గిడుగు రామమూర్తి చేసిన కృషి మరువలేమని వివేకానంద పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ చైతన్య, డైరెక్టర్ కోసమేటి శుద్ధోదన్‌లు పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో తెలుగు భాష పండితుడు కవి రామమూర్తి జయంతి కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం తెలుగు భాష ప్రాముఖ్యతను, వ్యవహార తీరు గురించి తెలియజేశారు. అంతేకాకుండా వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి తెలుగు పదాల వాడకాన్ని, భాష తీరుతెన్నుల గురించి తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు శాఖ అధిపతి రేఖ, అధ్యాపకులు నరేష్, చంద్రకాంత్, స్వప్న, సోని, శ్రీనివాస్, పూనం, కునాల్, పృథ్వి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాలపై బోథ్ ఎమ్మెల్యే ఆరా



వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా తాంసి మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా నష్టపోయిన ప్రాంతాలను శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. ఆయా గ్రామాలలోకి వెళ్లి పంటలతో పాటు నష్టం జరిగిన వివరాలు సేకరించారు. మోకాలు లోతు మట్టిలో సైతం నడుచుకుంటూ బాధిత రైతుల వద్దకు వెళ్లి విషయాలు అడిగి తెలుసుకున్నారు.

బోథ్: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న గ్రామాలను స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రోడ్డు పక్కన కోతకు గురైన పరిశీలించడంతో పాటు ధనూర్ గ్రామంలో వరద తాకిడి గురైన వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ త్వరలోనే అడెల్లి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అవుతాయని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ వర్షాకాలం అనంతరం పనులు ప్రారంభమైంది అని పేర్కొన్నారు. ఆయన వెంట ధన్నూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాగా, బోథ్ మండల కేంద్రం చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ జి.గంగాధర్ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయన అంత్యక్రియల అనంతరం స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్ ఆయన కుటుంబీకులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని అండగా ఉంటామని కుటుంబీకులకు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట నాయకులు మండల పార్టీ కన్వీనర్ నారాయణరెడ్డి, డాక్టర్ స్వామి సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, డాక్టర్ రవీంద్ర ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నారు.

నేరడిగొండ: సీఎం సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల తన నివాసంలో మండలంలోని మధుర తండా గ్రామానికి చెందిన పెళ్య సద్దు సింగ్‌కు మంజూరు అయిన రూ. 60 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు.



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

కలెక్టరేట్ ముందు జర్నలిస్టుల నిరసన

నిర్మల్ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పని చేస్తున్న జర్నలిస్టులు తమ ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇళ్ల స్థలాలు, రైల్వే పాసులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొండూరి రవీందర్, ప్రధాన కార్యదర్శి వెంకగారి భూమయ్య మాట్లాడారు. ఇందులో జాతీయ కమిటీ సభ్యులు గాండ్ల రాజశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ యోగేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు టి.రవీందర్, జిల్లా సంయుక్త కార్యదర్శి సట్ల హనుమాన్లు, జల్దా మనోజ్, ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : హెచ్‌ఎం

దిలావర్‌పూర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సదానంద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం సదానంద్ మాట్లాడుతూ.... క్రీడల వల్ల పోటీతత్వం, ఐక్యత, పట్టుదల అలవడుతాయన్నారు. ఆ తర్వాత పాఠశాలలో క్రీడా పోటీలు, క్విజ్ నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అంబాజీ విద్యార్థులకు క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీవో, స్పెషల్ ఆఫీసర్ గోవర్ధన్, ఈవో చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే, మండలంలోని సిర్గాపూర్ ప్లేయర్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకొని నిత్య జీవితంలో వివిధ క్రీడల ప్రాముఖ్యతపై అతిథులు ప్రసంగించారు.

పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయండి

బోథ్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి గ్రామస్థులు తమ గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ సుభాష్ చంద్రకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తాము జీడిపల్లి గ్రామం నుంచి కరత్వాడ గ్రామానికి వెళ్లి ఆరు కిలోమీటర్ల దూరంలో ఓట్లు వేయడం జరుగుతుందన్నారు. అయితే ప్రస్తుతం తమ గ్రామంలో 300 వరకు ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. రాజ గోండు సేవాసమితి డివిజన్ అధ్యక్షులు ధ్రువ విశ్వేశ్వరరావు, సహకార సంఘం డైరెక్టర్ ద్యాగల నారాయణ, మండాడి రాము, తదితరులు ఉన్నారు.

ఘనంగా మక్క కంకిడి పండుగ

నిర్మల్ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బత్తీస్‌గడ్ సమీపంలో ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో శుక్రవారం బావసార్ క్షత్రియ సమాజ్ వారి ఆధ్వర్యంలో మక్కకంకిడి కార్యక్రమం నిర్వహించినట్లు అధ్యక్షులు అంబేకర్ విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఏటా వినాయకచవితి తర్వాత ఈ పండుగని నిర్వహిస్తామని తెలిపారు. కోశాధికారి ధాంజెవర్ రాహుల్, ఉపాధ్యక్షులు ముదుల్కర్ భూమన్న, సురేష్, పూజారులు శంకర్, దత్తు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారులతో విచారణ జరపాలి

ముథోల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద మార్చి వరకు పూర్తి అయిన సీసీ రోడ్లపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరపాలని మాజీ ఎంపీపీ ఎజాజోద్దీన్, మండల కాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ముథోల్‌లో ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముథోల్ మండలానికి ఉపాధి పథకం కింద సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి సుమారు రూ. 3 కోట్ల 50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే ఇందులో సుమారు రూ. 50 లక్షల వరకు అవినీతి చోటుచేసుకుందని వారు ఆరోపించారు.

పెంబిలో ఉరి వేసుకొని ఒకరి మృతి

పెంబి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని అందె రమేష్(40) మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై హనుమండ్లు సంఘటన స్థలాన్ని పరిశీలించి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన అందె రమేష్‌కు మానసిక స్థితి బాగాలేక శుక్రవారం ఇంటి నుండి వెళ్లి గ్రామ శివారులోని ఫారెస్ట్ సమీపంలో ఉరి వేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కొడుకు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఈ సందర్భంగా తెలిపారు.

అసెంబ్లీలో.. గళమెత్తండి

(5వ పేజీ తరువాయి...)

ఆదుకోవాలన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

అడుగు ముందుకు పడలే..

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ల గడిచి పోతున్నా.. జిల్లా ప్రాజెక్టుపై ఊసెత్తినట్లే కనిపించడం లేదు. ముఖ్యంగా కోర్టా-చనకా, కుప్టి ప్రాజెక్టులతో పాటు పిప్రి, బుగ్గారం, తేజాపూర్ ఎత్తిపోతల పథకాల సర్వే పనులు పూర్తయినా.. నిధుల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. పెండింగ్‌లో ఉన్న కోర్టా-చనకా బ్యారేజీ పనులను పూర్తి చేసేందుకు నిధులను మంజూరు చేస్తే 50 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ప్రాజెక్టులను పూర్తి చేస్తే జిల్లాలో వేల ఎకరాల బీడుభూములు సస్యశ్యామలం కానున్నాయి. ప్రతియేటా వేల క్యూసెక్కుల వరద నీరు గోదారి పాలవుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువవుతున్నాడు. ప్రభుత్వాలు, పాలకులు మారిన జిల్లా ప్రాజెక్టులపై ప్రత్యేకదృష్టిని సారించినట్లు కనిపించడం లేదు. ఇప్పటి వరకు సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం అడుగు ముందుకు వేసినట్లు లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి నిధులకొరతనే ప్రధాన సమస్యగా మారిందంటున్నారు.

నెరవేరని ఎన్నికల హామీలు

గత ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరడమే లేదు. సరిపడా నిధులు లేక ఎక్కడి పనులు అక్కడే అన్నచందంగా మారింది. ముఖ్యంగా ఉట్నూర్ మండల కేంద్రంలో యూనివర్సిటీ, ఇంజనీరింగ్ కళాశాల, కేంద్రీయ విశ్వవిద్యాలయం, విమానాశ్రయం, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్ పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే బోథ్ రెవెన్యూ డివిజన్‌పై ప్రభుత్వ పెద్దలు నోరుమెదుపడం లేదంటున్నారు. చాలా మారుమూల గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు మార్గాలులేక పోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో వైద్యం అందక ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, రేణుక సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు కలగానే మారుతుంది.



పట్టుకున్న నిందితులతో ఫారెస్ట్ అధికారులు

వన్యప్రాణులను వేటాడిన నిందితుల అరెస్ట్

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రేంజ్ పరిధిలోని గిమ్మ గ్రామం వద్ద నాలుగు నెమళ్లు, ఒక కృష్ణ జింకను తుపాకీతో కాల్చి చంపిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్‌డీఓ చిన్న విశ్వనాథ్ భూషరెడ్డి తెలిపారు. మహారాష్ట్ర లోని పార్వకు చెందిన రాథోడ్ సందీప్, రాథోడ్ యోగేష్ వన్యప్రాణులను వేటాడి చంపినట్లు పేర్కొన్నారు. వీరి నుంచి ఒక కత్తి, నాటు తుపాకి, వలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వన్యప్రాణులను వేటాడితే వైల్డ్ లైఫ్ యాక్ట్ 1972 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

బాధిత కుటుంబాలకు ఎంపీ పరామర్శ

బోథ్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని పార్డీ బి గ్రామ మాజీ ఎంపీటీసీ మేశ్రమ భీం భాయ్ కుటుంబీకులను ఎంపీ జి.నగేష్ పరామర్శించారు. అనంతరం చింతల బోరి గ్రామంలో మృతి చెందిన పలువురు కుటుంబాలను పరామర్శించారు. ఆయా కుటుంబాల వారితో మాట్లాడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బిజెపి మండల పార్టీ కన్వీనర్ బి. రవీందర్, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మాజీ సభ్యులు జివి రమణ, జెడ్పిటిసి పార్లమెంట్ ఇంచార్జి రాజు, నాయకులు రాజేశ్వర్, మాజీ ఎంపిటిసి గులాబ్ సింగ్, మాజీ సహకార సంఘం చైర్మన్ ఎం. బాబు రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు సుభాష్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

'లంబాడీలను జాబితా నుంచి తొలగించాలి'

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): లంబాడీలను, బంజారాలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు, కాంగ్రెస్ నాయకుడు సోయం బాపురావు సుప్రీంకోర్టు లో పిటిషన్ వేశారు. 1976కు ముందు లంబాడీలు, బంజారాలు, సుగాళీలు బీసీల జాబితాలో ఉన్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. లంబాడీలు, బంజారాలు, సుగాళీలు వేరే రాష్ట్రాల నుంచి వచ్చి తమ హక్కులను దోచుకుంటున్నారని, 1976కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ జిల్లాలలో వీరిని ఎస్టీలుగా పరిగణించలేదన్నారు. ఇతర రాష్ట్రల నుంచి వచ్చి గిరిజనుల హక్కులను కొల్లగొడుతున్నారని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై పూర్తి వివరాలతో రిడర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం కోర్ట్ నోటీసులు ఇచ్చింది.

కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆశన్న డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... పండుగల పూట వేతనాలు అందక పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలన్నారు.

జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ

దిలావర్‌పూర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశురామ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లోని సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పూర్తయిన సిలబస్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌తో సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 31లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అందుకోసం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఫేషియల్ అటెండెన్స్ ప్రాముఖ్యతను వివరించాలని అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామారావు, టీచింగ్ స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు

సిరికొండ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో గుడుంబా తయారీ, విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పూజ అన్నారు. శుక్రవారం వాయిపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని చిమ్మన్ గుడి గ్రామంలో పోలీస్ సిబ్బందితో కలిసి ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిషేధిత గుడుంబా తయారీదారులతోపాటు విక్రయదారులపైన కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో గుడుంబా అనర్థాలను తండావాసులకు వివరించారు. అనంతరం ఐదు లీటర్ల గుడుంబా, 15 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. గుడుంబా తయారు చేసి, విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఏఎస్సై, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



చిమ్మన్‌గుడిలో గుడుంబా, బెల్లం పానకంను ధ్వంసం చేస్తున్న పోలీసులు


బజార్ హత్నూర్ మండల కేంద్రం వద్ద కడెం వాగు వంతెనపై ఏర్పడిన గుంత

వరద ఆగింది.. గాయం మిగిలింది

బజార్ హత్నూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన భారీవర్షాలకు మం డలంలో పలు చోట్ల రహదారులు కోతకు గురికాగా రా కపోకలకు ప్రమాదకరంగా మారాయి. వరద ధాటికి దేగామ, బోస్రా గ్రామాల మధ్య కల్వర్టు కోతకు గురవడంతో తీవ్ర ఇబ్బందులతో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. మొర్కండి గ్రామ సమీపం లోని వాగుపై లో లెవల్ వంతెన వరద నీటికి దెబ్బతినడంతో గ్రామస్తులు తాత్కాలికంగా బండరాళ్ల ఏర్పాటుతో ఇబ్బందులు నడుమ ప్రయాణం సాగిస్తున్నారు. మండల కేంద్రం సమీపంలోని కడెం వాగు వద్ద వర్షానికి మట్టి కుంగిపోవడం తో గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది.


దేగామా బోస్రా గ్రామాల మధ్య ప్రమాదకరంగా మారిన కల్వర్టు

నష్టాలు మిగిల్చిన వర్షాలు

▸ ఉట్నూర్ మండలంలో 900 ఎకరాల్లో పంట నష్టం


శంకర్‌తండా సమీపంలోని పత్తి చేనులో నిలిచిన వరద నీరు

ఉట్నూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలు నష్టాలు మిగిల్చాయి. ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్, శంకర్‌తండా, చాందూరి, ఉమ్రి, నర్సాపూర్ బి,సాలెవాడ కే, సాలెవాడ బి, తాండ్ర, షాంపూర్, లక్కెట్టిపేట, దంతనపల్లి, పులిమడుగు, బీర్సాయిపేట తదితర 29 గ్రామాలకు చెందిన రైతులు భూములతో వేసిన పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు అంచనాల ప్రకారం పత్తి 750 ఎకరాల్లో, సోయాబీన్ 21 ఎకరాలలో, కంది పంట 21 ఎకరాలలో, మొక్కజొన్న 98 ఎకరాలలో, ఇతర పంటలు 20 ఎకరాలలో వర్షాలకు నష్టం జరిగినట్లు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని వాగు పరివాహక ప్రాంతంలో ఉన్న రోడ్లు సైతం దెబ్బతిన్నాయి. షాంపూర్ నుంచి లక్కెటిపేట వెళ్లే మార్గంలో ఉన్న వాగు వద్ద అప్రోచ్ రోడ్డు దెబ్బతిని కంకర లేచింది. ఇదే మాదిరి చందూరి, తాండ్ర వెళ్లే మార్గాలు సైతం దెబ్బతిన్నాయి. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడంతో పాటు చెడిపోయిన రోడ్లుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.


బాసర గోదావరి స్నానఘట్టం ఎగువన గంగమ్మ తల్లిని తాకిన గోదారమ్మ


ఉధృతంగా ప్రవహిస్తున్న బాసర గోదావరి


మహా వరదతో బాసర పుణ్యక్షేత్రం పరిసరాలు జలమయం

గోదావరి ఉగ్రరూపం



- ▸ ఎగువ మహారాష్ట్ర నుంచి భారీగా వరద
- ▸ పొంగిన వాగులు వంకలు
- ▸ స్తంభించిన జనజీవనం
- ▸ బాసర ఆలయం వద్ద నీట మునిగిన రహదారులు
- ▸ ప్రైవేటు హోటళ్లు, నివాసాల చుట్టూ వరద నీరు
- ▸ చిక్కుకున్న బాధితులను కాపాడిన అధికారులు
- ▸ వేల ఎకరాల్లో పంట నష్టం

బాసర, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బాసర ప్రాంతంలో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. నది నీరు పొంగి పరివాహక ప్రాంతాలపై బీభత్సం సృష్టించింది. పలు లోతట్టు గ్రామాలు జలమయమైపోయాయి. ఉదయం నుంచి క్రమంగా పెరుగుతున్న వరద నీరు రహదారులు, వీధులను ముంచెత్తింది. పంట పొలాలు నీట మునిగి పోయాయి. నివాస గృహాలు, లాడ్జీలు, వ్యాపార కేంద్రాల చుట్టూ వరద నీరు చుట్టు ముట్టింది. అడవిలో చిక్కుకున్న బాధితులకు అధికారులు స్థానిక జలాలతో ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పడవలపై సురక్షితంగా బయటకు తరలించారు.

● విశేషమేమిటంటే..

స్థానికంగా భారీ వర్షాపాతం లేకపోయినా పై ప్రాంతాల నుంచి వచ్చి చేరిన వరద నీటితో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో బాసర పరిసర ప్రాంతమంతా నీట మునిగి జలదిగ్బంధంలా మారిపోయింది. సరస్వతి అమ్మవారి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారులు మూసుకోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. భక్తుల స్నాన ఘట్టాలన్నీ నీట మునిగాయి.

● గోదావరి తీరం.. భయం భయం

గురువారం సాయంత్రం వరకు సాధారణంగా ఉన్న నది ప్రవాహం శుక్రవారం తెల్లవారే సరికి పరిస్థితి ప్రమాదకరంగా మారింది. నది అంచున నుంచి రెండు కిలోమీటర్ల వరకు వరద నీరు పోటెత్తింది. భక్తుల స్నాన ఘట్టాలు, పలు రహదారులు, పంట పొలాలు అన్నీ జలబయంగా మారాయి. సరస్వతి ఆలయం నుంచి గోదావరికి వెళ్లే రహదారి వెంట గల భవనాలు చుట్టూ వరద నీరు చేరింది. లోతట్టు ప్రదేశాలలో చిక్కుకున్న వారిని వెంటనే అధికారులు నాటు పడవలపై బయటకు తెచ్చారు. వరద నీరు తగ్గుతుందని భావించిన దినమంతా పెరుగుతూనే ఉండడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. క్రమక్రమంగా పెరిగి సరస్వతి ఆలయం అతి సమీపాన టీటీడీ వసతి గృహం వద్ద వరకు వరద నీరు చేరింది. వరద పెరుగుతుండడం పై స్థానికుల్లో భయం ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఇలాలే వరద కొనసాగితే ఆలయ పరిసరాలన్నీ వరద నీరు ముంచెత్తే ప్రమాదం పొంచి ఉంది.


బాసర వద్ద ఎస్‌బీఐ వద్ద పరిస్థితి

బాసర ఎస్‌బీఐ బ్యాంకు లోపల వరకు చేరిన వరద నీరు

● వేల ఎకరాల్లో పంట నష్టం

నది పరివాహక ప్రాంతంలో పంట పొలాలన్నీ నీట మునిగాయి. పత్తి సోయా వరి పంటలలు తీవ్రంగా నష్టపోయాయి. పంట పొలాలన్నీ వరద నీటితో చెరువులు, సరస్సులను తలపించాయి. శుక్రవారం ఏర్పడిన గోదావరి బీభత్సంతో ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరగినప్పటికీ పంట నష్టం మాత్రం భారీ స్థాయిలో జరిగింది. ఒక బాసర గ్రామ రైతులే కాదు మండలంలోని అన్ని గ్రామాల రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. నది పరివాహక ప్రాంతంలో గల సురెల్లి, సాలాపూర్, సావర్గం, కౌట, ఓని గ్రామాల పరిధిలో వేల ఎకరాలు నీట మునిగాయి.

● ప్రమాద స్థాయి దాటి నది ప్రవాహం..

శుక్రవారం గోదావరి ఉగ్రరూపం కనిపించింది. ఎగువ భాగం నుండి వస్తున్న భారీ వరద నీటితో నది తీరమంతా భయానకంగా మారింది. బాసర వద్ద గోదావరి నదిపై గల వంతెనల ప్రమాద సూచకలను దాటి వరద నీరు ప్రవహిస్తుంది. వెంతనకు కేవలం అడుగు కింద నుంచి నదిలో వరద నీరు వేగంగా ప్రవహిస్తుంది. దీంతో వంతెన వద్ద ఏర్పడిన ప్రమాద పరిస్థితులను గమనించి రైల్వే శాఖ రైళ్ల రాకపోకలను పూర్తిగా నిలిపివేసింది. బాసర మీదుగా వెళ్లే రైలు అన్నింటినీ రద్దు చేసింది.

● జాతీయ రహదారిని ముంచెత్తిన వరద

బాసర భైంసా జాతీయ రహదారిని వరద నీరు ముంచెత్తింది. బిదిరెల్ల గ్రామం వద్ద రహదారిపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోలకు అంతరాయం ఏర్పడింది. ముందు జాగ్రత్తగా బారికేడ్లు పెట్టి అధికారులు వాహనాలను అనుమతించలేదు. అదే విధంగా బాసర మండలంలోని బబాసర మండల కేంద్రంతో కిర్గుల్(బి), ఓని, కౌటా, సాలాపూర్, కిర్గుల్(కే) గ్రామాలకు వెళ్లే రహదారిపై గల వాగు వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచి పోయాయి.

● లక్షల క్యూసెక్కుల్లో ఇన్‌ఫ్లో... అవుట్ ఫ్లో

గోదావరి శుక్రవారం దినమంతా ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుంది. నది పూర్తిస్థాయి నీటిమట్టం దాటి పోయింది. శుక్రవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు ఎగువన మహారాష్ట్ర నుంచి నాలుగున్నర లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతుంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు పూర్తి గేట్లు ఎత్తి ఐదున్నర లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన వదులుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఇన్‌ఫ్లో పెరిగింది. దీనికి తోడు బాసర ప్రాంలో నదికి ఇరువైపులా మన ప్రాంతంలో వాగులు వంకల నుంచి వచ్చే నీరు అదనం, ఈ కారణంగానే నదిలో చేరే నీటి వరద పెరిగి నది పరివాహక ప్రాంతాల్లో వరద పోటీ ఎత్తింది. ఆల్ అవుట్‌లో ఐదున్నర లక్షల క్యూసెక్కులు పెంచే అవకాశం లేనందున శ్రీరామ్ సాగర్ బ్యాక్ వాటర్ వరదతో బాసర మండలంతో పాటు నిర్మల్ జిల్లాలో ఉన్న ఇతర మండలాలు నదికి ఆ వైపు ఉన్న నిజామాబాద్ ఏరియాలో వేల ఎకరాల్లో పంటు నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రస్తుతం మహారాష్ట్రలో అన్ని ప్రాజెక్టుల నుంచి వరద నీటిని దిగువకు వదులుతున్నారు. అందుకే బాసర ప్రాంతంలో గత రెండు రోజుల నుండి ప్రమాదకర స్థాయిలో వర్షాలు లేనప్పటికి వరద పోటెత్తింది.


భైంసాలో నీట మునిగిన శ్మశాన వాటిక


భైంసాలో జలమయమైన బైపాస్ రోడ్డు మార్గం


భైంసాలో గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి సుద్దవాగులోకి వదిలిన వరద నీరు

భైంసాను ముంచెత్తిన.. గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వరద


భైంసా హన్మాన్ మఠం వద్ద నిలిచిన సుద్దవాగు వరద నీరు


భైంసాలో సుద్దవాగు బైపాస్ రోడ్డు మార్గంలో జలయమమైన పెట్రోల్ బంక్


భైంసా సుద్దవాగు పరివాహకంలో నీట మునిగిన పంటచేలు

- ▸ జలమయమైన పలు కాలనీలు, రోడ్లు
- ▸ పురాణబజార్‌లో కూలిన రేకుల ఇళ్లు
- ▸ నీట మునిగిన పంట చేలు
- ▸ ఇళ్లకు విద్యార్థుల తరలింపు
- ▸ భయాందోళనలతో కాలం వెళ్లదీసిన ముంపు బాధిత ప్రాంతాల వాసులు

భైంసా, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో శుక్రవారం మున్సిపల్ కేంద్రమైన భైంసాలో వరద బీభత్సం ఏర్పడింది. ప్రాజెక్టులోకి అధిక మొత్తంలో వరద నీరు వచ్చి చేరడంతో నిర్వాహణాధికారులు సుద్దవాగులోకి భారీగా వరద నీటిని వదిలిపెట్టారు. ఉదయం వేళ నుంచి ఇన్‌ఫ్లో ఇంతకింతకు పెరుగుతూ పోయి మధ్యాహ్నం సమయానికి 43 వేల క్యూసెక్కులకు ఎగబాకింది. దీంతో ప్రాజెక్టు నిర్వాహణాధికారులు తొలుత ఒక వరద గేట్ ద్వారా తదుపరి ఇన్‌ఫ్లోకు అనుగుణంగా మరో నాలుగు గేట్లను ఎత్తివేసి మొత్తం ఐదు వరద గేట్ల ద్వారా దిగువనున్న సుద్దవాగులోకి 37 వేల క్యూసెక్కుల వరద నీటిని వదిలివేసారు. సుద్దవాగులోని వరద నీరు భైంసాను ముంచెత్తింది. సుద్దవాగు పరివాహక ప్రాంతాలతో పాటు సమీప ప్రాంతాల్లోని కాలనీలకు ముంపు బెడద ఏర్పడింది. కుభీర్ రోడ్డు మార్గం, సుద్దవాగు బైపాస్ రోడ్డు మార్గం, వివేకానంద చౌక్, ఖాన్ ఆటోనగర్ ప్రాంతాల్లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో ఈ రోడ్డు మార్గాల్లో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వరద నీటి ప్రభావంతో భైంసా నుంచి కుభీర్, నిగ్వా, పాలజ్, కిని మార్గాలకు వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి.ముంపు బెడద ఏర్పడటంతో సుద్దవాగు పరివాహక సమీప ప్రాంతాల్లోనున్న మైనార్టీ గురుకులం, జ్యోతిబా పులే గురుకుల పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. వీటిల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సురక్షితమైన విధానాల ద్వారా బయటకు తరలించి తల్లితండ్రుల ద్వారా వారివారి స్వగ్రామాలకు పంపించి వేసారు. రాహుల్‌నగర్, గోకుల్‌నగర్,భాగ్యనగర్, వినాయక్‌నగర్, ఖాన్ ఆటోనగర్, భట్టిగల్లి, పులేనగర్ కాలనీల పరిధిలలోకి వరదనీరు రావడంతో ఆయా ప్రాంతాలవాసులు భయాందోళనలకు గురయ్యారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి వేళ వరద నీటి ఉధృతి తగ్గేంత వరకు వారందరూ బిక్కుబిక్కుమంటు కాలం గడిపారు. భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ తహసీల్దార్ ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్, పోలీసు, అగ్నిమాపకశాఖాధికారులు సిబ్బందితో కలిసి ముంపు బాధిత ప్రాంతాల్లో పర్యటించారు.ఆయా ప్రాంతాలవాసులతో మాట్లాడి అప్రమత్తం చేశారు. పలువురిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వివేకానంద చౌక్, ఖాన్ ఆటోనగర్ ప్రాంతాల్లోని పలు వ్యాపార సముదాయల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో ఆయా వ్యాపార సంస్థల్లోని సామాగ్రిని వాహనాలు, ఇతర మార్గాల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎస్ఆర్ గార్డెన్స్, బృందావన్ గార్డెన్స్, సురలోక్ గార్డెన్స్ మండపాలతో పాటు అక్కడి మార్గాల్లోని పెట్రోల్‌బంక్‌లను వరదనీరు ముంచెత్తింది. సుద్దవాగు పరివాహకంలోనున్న సుదవాగు శివాలయం, శ్మశాన వాటిక నీట మునిగాయి.


భైంసా నుంచి కుభీర్ వెళ్లే రోడ్డును ముంచెత్తిన వరద నీరు


పెండల్‌వాడ గ్రామంలో నేలపాలైన పత్తి, సోయా పంటలు

రైతుల ఆశలపై నీళ్లు

- ▸ వరదలు ముంచెత్తడంతో పంటలు నేలపాలు
- ▸ ఆందోళనలో అన్నదాతలు



ఆదిలాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గంపెడాశలతో పంటలను సాగు చేసిన భారీ వర్షాలు, వరదలు అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లాయి. చేతికి వచ్చిన పంటలు చేజారి పోవడంతో రైతులు దిక్కులు చూడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. వేల రూపాయల పెట్టుబడులు పెట్టిన పంటలన్ని నేలపాలయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పెన్‌గంగా నదికి వరద ఉధృతి భారీగా పెరిగింది. దీంతో నది పరివాహక ప్రాంతంలోని పంటలను వరదనీరు ముంచెత్తింది. దీంతో పత్తి, సోయా పంటలన్నీ పూర్తిగా ధ్వంసమై పోయి నీటిపాలయ్యాయి. ముఖ్యంగా భీంపూర్, తాంసి, తలమడుగు, జైనథ్, బోరజ్, బేల మండలాల్లో తీవ్రంగా పంట నష్టం వాటిల్లింది. గత వారం రోజుల క్రితం వరకు ఏపుగా పెరిగి కనిపించిన పంటలు ప్రస్తుతం పూర్తిగా కనిపించకుండానే పోయాయి. మళ్లీ పంటలను సాగు చేసేందుకు చేతిలో చిల్లిగవ్వ లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

- ▸ వినాయక విగ్రహానికి దాతగా మైనార్టీ యువకుడు
- ▸ లడ్డూ ప్రసాదానికి దాతగా మరో మైనార్టీ యువకుడు
- ▸ నేడు రక్షక్ దళ్ గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదానం
- ▸ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నేడు కొన్ని ప్రాంతాల్లో మతాల పేరిట, కులాల పేరిట వివాదాలు సృష్టించే వారికి కనువిప్పుగా వినాయక ఉత్సవాలలో మత సమరస్యాన్ని చాటుతూ ఆ యూత్ సభ్యులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఖానాపూర్ మండల కేంద్రంలోని రక్షక్ దళ్ యూత్ బృందం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారు. రక్షక్ దళ్ గణేష్ మండలిని ఏర్పాటు చేసి స్థానిక ప్రభుత్వ పశువుల ఆసుపత్రి నూతన భవనంలో వినాయక మండపాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ మండపంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రక్షక్ దళ్ యూత్‌కు చెందిన సుర్జాపూర్ గ్రామ యువకుడు మహమ్మద్ ఇజాజ్ రూ. 15 వేలతో వినాయక విగ్రహాన్ని, పూజా సామాగ్రిని కొనిచ్చాడు. అదే యూత్‌కు చెందిన మహమ్మద్ రఫీక్ వినాయకుని ప్రసాదానికి 16 కిలోల లడ్డుకు దాతగా నిలిచాడు. మొత్తం 32 మంది సభ్యులు ఉన్న ఈ రక్షక్ దళ్ యూత్‌లో నలుగురు మైనారిటీ యువకులు సైతం ఉన్నట్లు ఈ గణేష్ మండలి నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుతం రక్షక్ దళ్ గణేష్ మండలి అధ్యక్షులుగా షేక్ సోహెబ్ ఖాన్ కొనసాగుతున్నాడు.

భక్తులకు కొంగుబంగారం కర్ర గణపతి

● ఒకే మండపంలో కర్ర గణపతి, మట్టి గణపతి ఏర్పాటు


దిలావర్‌పూర్‌లో ఒకే మండపంలో ఏర్పాటు చేసిన కర్ర గణపతి, మట్టి వినాయకుడు

ఖానాపూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచాన్నే గడగడలాడించిన కరోనా ఆ ఊరును దరిచేరలేదు. 2020లో దేశ వ్యాప్తంగా కరోనా మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో ఎక్కడ చూసినా కరోనా కేసులు పెరిగిపోతున్న సమయంలో వినాయక చవితి వచ్చింది. దీంతో తమ గ్రామంలోకి కరోనా మహమ్మారిని రానివ్వకుండా చూడాలని ఖానాపూర్ మండలంలోని దిలావర్‌పూర్ గ్రామస్థులంతా కర్రతో గణపతిని చేయించి నవరాత్రుల పాటు పూజించారు. కాగా ఆ ఏడాది నుంచి ఆ గ్రామంలో ఒక్క కరోనా మరణం గాని కేసు గాని నమోదు కాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. అప్పటి నుంచి తమ గ్రామాన్ని రక్షించిన కర్ర వినాయకుడిని ప్రతి సంవత్సరం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రతిష్టిస్తున్నారు. నవరాత్రుల పాటు పూజిస్తూ ఆ తర్వాత నదీ జలాలతో అభిషేకం చేసి తిరిగి ఆంజనేయ స్వామి ఆలయంలోని నైరుతి మూలలో కర్ర గణేశుని విగ్రహాన్ని భద్రపరుస్తున్నారు. పర్యావరణ హితం కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నిషేధించి ఓవైపు కర్ర గణేశుడిని, అదే మండపంలో మరోవైపు మట్టి వినాయకుడి ఏర్పాటు చేసి నవరాత్రుల పాటు పూజిస్తూ దిలావర్‌పూర్ గ్రామస్థులు మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. త్వరలోనే ఈ కర్ర గణేశుడికి ప్రత్యేకమైన ఆలయాన్ని సైతం నిర్మించేందుకు ఆలోచన చేస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

అపార నష్టం

- జిల్లాకు కోలుకోలేని దెబ్బ
- వరదతో సతమతం
- నీట మునిగిన పంటలు
- ధ్వంసమైన రోడ్లు
- అనేక పల్లెలకు నిలిచిన రాకపోకలు
- అంచనాల రూపకల్పనలో అధికార యంత్రాంగం



నీట మునిగిన పంటలు

నిర్మల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాను 24 గంటల పాటు కురిసిన ఏకధాటి వర్షం చిన్నాభిన్నం చేసింది. వర్షం కారణంగా పొటెత్తిన వరద అనేక లోతట్టు గ్రామాలను ముంచేసింది. జిల్లా కేంద్రంలోని పలు వార్డులతో పాటు అనేక మారుమూల పల్లెలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. గోదావరి నది ఉప్పొంగడమే కాకుండా అనేక వాగులు, వంకలు, కాలువలు పొంగి ప్రవహించడంతో రోడ్లు ధ్వంసమయ్యాయి. రోడ్లతో పాటు వంతెనలు సైతం కుప్పకులాయి. అనూహ్యంగా కురిసిన ఈ వర్షాలు చేసిన నష్టంతో జనం ఇంకా కొలుకోలేకపోతున్నారు. అలాగే అధికార యంత్రాంగం సైతం ఇంతటి నష్టాన్ని ఉహించలేకపోయింది. కలెక్టర్, ఎస్పీతో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులంతా యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టినప్పటికీ ప్రాణ నష్టాన్ని నివారించారే తప్పా పంటలు, ఆస్తినష్టాన్ని మాత్రం అడ్డుకోలేకపోయారు. అనేక చోట్ల కాలువలకు గండ్లు పడగ ఆ నీటి ఉధృతికి పంటపొలాలన్ని నీట మునిగాయి. ముఖ్యంగా నీటి పారుదల శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల కు ఈ భారీ వర్షం కారణంగా పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం నుంచే అధికార యంత్రాంగమం తా రంగంలోకి దిగి జరిగిన నష్టా న్ని అంచనా వేయడంలో నిమగ్నమయ్యారు. క్షేత్రస్థాయిలో జరిగిన నష్టంపై ప్రాథమిక అంచనాలను రూపొందించిన అధికారులు ఆ నివేదికలన్నింటినీ సర్కారుకు పంపారు. జిల్లాలో భారీగా నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు నిరూపిస్తుండగా ఇక ఆశించిన మేరకు పరిహారం అందించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అంటున్నారు.

పంటలకు భారీగా నష్టం...

జిల్లాలోని వరి, పత్తి, సోయాబీన్ పంటలతో పాటు కూరగాయలు ఇతర పప్పు దినుసు పంటలన్నీ దాదాపుగా నీటమునిగాయి. చాలా చోట్ల వర ద దాటికి ఈ పంటలు నేలకొరగగా వందల ఎకరాల్లో ఇసుకమేటలు వేయడం రైతులను తీవ్రఆందోళనకు గురి చేస్తోంది. ఎకరాల కొద్ది ఇసుక మేటలు, బురద పంట చేనులను ముంచి వేయడంతో రైతులకు ఇదీ కోలుకోలేని దెబ్బగా చెబుతున్నారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ పరిధిలో ఇప్పటి వరకు 12,283 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారుల ప్రాథమిక అంచనాల్లో నిర్ధారించారు. వ్యవసాయ శాఖ పరిధిలో 9వేల ఎకరాలు, ఉద్యానవన శాఖ పరిధిలో పండ్ల తోటలు, ఇతరత్రా 3283 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు సర్వే ద్వారా నిరూపితమవుతోంది. మొత్తం 2823 ఎకరాల్లో పత్తి పంట, 2152 ఎకరాల్లో సోయా పంట, 2491 ఎకరాల్లో వరి పంట, 1100 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. కాగా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో 2647 ఎకరాల్లో పసుపు పంట, 289 ఎకరాల్లో కూరగాయలు, 327 ఎకరాల్లో ఆయిల్ పాం పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తున్నాయి.

ఇంజనీరింగ్ శాఖలకు అధిక నష్టం...

జిల్లాలోని పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ శాఖలకు భారీనష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాల ద్వారా వెల్లడవుతోంది. ముఖ్యంగా రోడ్లు పెద్దసంఖ్యలో ధ్వంసమయ్యాయి. అలాగే చాలా చోట్ల వంతెనలు సైతం కూలిపోయాయి. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 122 కిలోమీటర్లమేర 30 రోడ్లు పెద్దఎత్తున దెబ్బతిన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. దీనినష్టం దాదాపు రూ.6.80 కోట్ల వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోని 150 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతినగా 48 కల్వర్టులకు పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. ఈ శాఖ పరిధిలో జరిగిన నష్టం దాదాపు మూడున్నర కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని సంబంధిత శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో పాటు 24 ఇండ్లు కూడా పాక్షికంగా ధ్వంసమైనట్లు అధికారులు నష్టం అంచనాల్లో పేర్కొంటున్నారు.

దెబ్బతిన్న చెరువులు, కాలువలు...

నీటిపారుదల శాఖ పరిధిలోని చెరువులు, కాలువలకు చాలాచోట్ల గండ్లు పడడం, మరికొన్ని చోట్ల కొట్టుకుపోవడం జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మొత్తం 40 చెరువులు, కెనాల్‌లు పూర్తిగా దెబ్బతిన్నట్లు అధికారులు తమ నష్టం అంచనాల్లో పేర్కొన్నారు. మరమ్మతుల కోసం రూ.8 కోట్ల మేర అవసరమవుతాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు యుద్ధప్రాతిపాదికన నష్టం అంచనాలను రూపొందించినప్పటికీ పూర్తిస్థాయి నివేదికల అనంతరం మొత్తం నష్టం విలువ వెల్లడవుతోందని చెబుతున్నారు.



కుంటాలలో నీటి ఉధృతికి కోతకు గురైన బ్రిడ్జి



పెంబి మండలంలో వరద నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన పత్తి పంట





స్వర్ణ ప్రాజెక్టు ఎడమ కాలువకు గండి, సారంగాపూర్‌లో దెబ్బతిన్న పత్తి

అంతటా కొలువుదీరిన గణనాథులు

ఏకదంతాయ వక్రతుండాయ గౌరీ తనయాయ ధీమహి అంటూ భక్తులు గణనాథుడిని పూజిస్తున్నారు



నర్సాపూర్‌లో గణపయ్య



కిషోర్ గణేష్ మండలి యూత్ గణపతి



డ్రైప్రూట్ గణపతికి పూజలు చేస్తున్న డాక్టర్ దేవేందర్ రెడ్డి దంపతులు



వినాయకపూజలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీవాణి

తుది ఓటరు జాబితాకు సహకరించండి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికల నేపథ్యంలో తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను ఇప్పటికే ప్రదర్శించామని తెలిపారు. ఈ జాబితాలపై అభ్యంతరాలను ఈ నెల 30వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. ఆ తరువాత సెప్టెంబరు 2న గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా ఫోటోలతో కూడిన తుది జాబితాను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా రాజకీయ పక్షాలు సహకరించాలని, ఓటరు జాబితాలు, పోలింగ్ కేంద్రాలపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా గడువు లోగా సమర్పించాలని సూచించారు. సమావేశంలో బీజేపీ నాయకులు శ్రావణ్ రెడ్డి, ఎంఐఎం నాయకుడు మజార్, బీఆర్ఎస్ నేత కొరిపెల్లి రాంకిషన్ రెడ్డి, రమేష్, టీడీపీ రమేష్, వైఎస్ఆర్‌సీపీ నరేష్, ఆమ్ ఆద్మీ పార్టీ హైదర్ పాల్గొన్నారు.

డిపో నిర్వహణకు ముందస్తు చర్యలు

భైంసా, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరద నీటితో పొంచి ఉన్న ముంపు బెడద నష్ట నివారణకు భైంసా బస్ డిపో అధికారు లు ముందస్తు చర్యలు చేపట్టారు. శుక్రవారం గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తివేసి సుద్దవాగులోకి నీటిని వదిలారు. ఈ క్రమంలో సుద్దవాగు పరివాహక ప్రాంతానికి సమీపంలోనున్న ఇక్కడి డిపోకు వరద నీటి ముంపు బెడద ఏర్పడింది. రెండు సంవత్సరాల క్రితం వరద డిపోను ముంచెత్తడంతో కష్ట, నష్టాలు ఎదురయ్యాయి. ఈసారి డిపోమేనేజర్ హరిప్రసాద్ ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే శుక్రవారం కంప్యూటర్లు, ఇతర సామగ్రి తదితర వాటన్నింటిని హుటాహుటిన ఇక్కడి బస్టాండ్‌కు తరలించారు. మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరద నీటితో ముంపు బారిన పడిన ప్రాంతాల్లో ఉన్నతాధికారుల బృందం పర్యటించింది. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా ప్రత్యేకాధికారి హరి కిరణ్, కలెక్టర్ అభిలాష అభినవ్, సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్‌లతో కూడిన బృందం పర్యటించింది. బాధితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



బస్టాండ్‌లో డిపో ఏర్నింగ్ సెక్షన్

పంట నష్టంపై పకడ్బందీ సర్వే చేపట్టండి

- అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్



తర్లపాడ్‌లోబాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్ మండలాల అధికారులను ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట నష్టంపై పకడ్బందీ సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాల దాటికి తెగిపోయిన వంతెనలు, రోడ్లు ఏ శాఖ పరిధిలో ఎన్ని ఉన్నాయో వాటి మరమ్మతులకు ఎన్ని నిధులు అవసరయో తక్షణమే సర్వే నిర్వహించి ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమాల్లో ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, పీఏసీఎస్ చైర్మన్‌లు శ్రీనివాస్ రెడ్డి, ఆమంద శ్రీనివాస్, రమేష్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు చిన్నం సత్యం, అంకం రాజేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణాధ్యక్షులు నిమ్మల రమేష్, ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, పోలంపెల్లి సచిన్, శెట్టి శ్యామ్, జంగిలి శంకర్, సార్ల నర్సయ్య, రఘుపతి రెడ్డి సహా అధికారులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్డు పరిశీలన

కుంటాల : మండలంలోని కల్లూరు - కుంటాల రహదారిపై అందకూర్ అలుగు నీటి ఉధృతితో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న బ్రిడ్జిని శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో పాటు అడిషనల్ కలెక్టర్ కిశోర్ కుమార్, జిల్లా ప్రత్యేకాధికారి హరి కిరణ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బ్రిడ్జి గతంలో కూడా దెబ్బతిందని, తాత్కాలిక మరమ్మతులు అప్పట్లో చేపట్టినట్లు, మళ్లీ ఈ సమస్య తలెత్తడంతో శాశ్వత పరిష్కారం చేపట్టేందుకు, భవిష్యత్తులో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి

లక్ష్మణచాంద : భారీ వర్షాలు, గోదావరి వరద వలన నష్టపోయిన పం టకు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని చామన్‌పెల్లి రైతులు శుక్రవారం తహసీల్దార్ సరితకు విన తిపత్రం అందజేశారు. గోదావరి, వాగు, చెరువు, సెలయేర్లు తదితర పరివాహక ప్రాంతంలో నీటమునిగిన పంటల వలన రైతులు నష్టపోయే అవకాశం ఉందని, అందువలన జరిగిన నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘం నిర్మల్ జిల్లా కార్యవర్గసభ్యులు సంత సాగర్ రెడ్డి, చామన్‌పెల్లి కార్యవర్గ అధ్యక్షులు పి.కృష్ణ, ఉపాధ్యక్షులు మధుకర్ రెడ్డి, బి.మల్లేష్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

భైంసా : భారీ వర్షాలతో పంటల పైర్లు దెబ్బతిని నష్టపోయిన రైతాంగానికి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు రావుల రాము కలెక్టర్ అభిలాష అభినవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత విషయంలో కలెక్టర్‌ను భైంసాలోని విశ్రాంతి భవనంలో కలిసి వినతి పత్రం అందచేసి మాట్లాడారు. అధికంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో పైర్లు నీట మునిగి తెగుళ్ల బారిన పడటం, పైర్లు దెబ్బనడం, పంట చేలు కోతకు గురవ్వడం లాంటి కారణాలతో అన్నదాతలు నష్టపోయారని వివరించారు. ఇందులో భైంసా పట్టణ పరిధిలోని ఆయా వార్డుల బీజేపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువు కట్టను పరిశీలించిన మాజీ మంత్రి

నర్సాపూర్(జి), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలంలోరెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దేవుని చెరువు కట్ట తెగిపోయింది. ఈ ఘటనపై మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు. చెరువు కట్ట తెగిపోవడం వల్ల వరద నీరు పొంగిపొర్లి సమీపంలోని పంట పొలాల్లోకి చేరి తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న ఇంద్రకరణ్ రెడ్డి వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని తెగిపోయిన చెరువు కట్టను, నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. చెరువు నీరు చేరడంతో నష్టపోయిన పంటలను ముఖ్యంగా ఆయిల్ పామ్ పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. తక్షణమే కట్ట మరమ్మతు పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా నష్టపోయిన రైతులను గుర్తించి వారి వివరాలను తక్షణమే సేకరించాలన్నారు. రైతులు అధైర్యపడవద్దని, అండగా ఉంటామన్నారు. పర్యటనలో మాజీ జడ్పీటీసీ అరుగుమీది రామయ్య, మాజీ సర్పంచ్ రామ్‌రెడ్డి, నాయకులు నారాయణ, గంగారాం, సురేష్, పాల్గొన్నారు.



మండల కేంద్రంలోని దేవుని చెరువు కట్టను పరిశీలిస్తున్న దృశ్యం

వరద ప్రాంతాల పరిశీలన

తానూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బేల్‌తరోడా, భోల్సా, ఝరి(బి), జౌల(బి), తొండాల, మొగిలి, కోలూర్ గ్రామాల్లో, గురువారం కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలయిన ఆయా గ్రామాలను శుక్రవారం ఎమ్మెల్యే రామారావుపాటిల్, ఎస్పీ జానకీ షర్మీలలు పరిశీలించారు. ముంపు ప్రాంతాల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. వీరి వెంట ఏఎస్పీ అవినాష్‌కుమార్, ఎంపీడీవో నసీరోద్దిన్, తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎస్సై షేక్ జుబేర్, గ్రామ కార్యదర్శులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులున్నారు.



తొండాలలో పర్యటిస్తున్న ఎస్పీ

ఉప్పొంగిన ఉత్తర వాహిని



ఖానాపూర్‌లో గంగమ్మ గుడిని తాకి ప్రవహిస్తున్న గోదావరి నది

ఖానాపూర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఎగువన ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడం తో ఖానాపూర్ వద్ద ఉత్తరవాహిని గోదావరి నది ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తోంది. శుక్రవారం నదీతీరంలోని 200ల మీటర్లదూరంలో ఉన్న ఎల్లమ్మ ఆలయానికి వరదనీరు తాకింది. దీంతో ఖానాపూర్ శివారులోని గోదావరి నది తీరంలో ఉన్న పంటచేలలోకి వరద నీరు చేరి పంటలన్నీ నీటమునిగాయి. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తూ ఉండడంతో రెంకోని వాగు నుంచి వస్తున్న నీరు గోదావరిలోకి వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. దీంతో ఆ నీరంతా పంట పొలాల్లోకి చేరడంతో దిలావర్‌పూర్ శివారులోని పంట పొలాలన్నీ నీటట మునిగాయి.

కుభీర్ : మండలంలోని గ్రామాల్లో శుక్రవారం వేకువజామున వర్షం దం చి కొట్టింది. నాలుగు రోజులుగా మండలంలో సాధారణ వర్షపాతం నమోదైంది. శుక్రవారం ఉదయం మూడు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. 118.0 ఎంఎం వర్షపాతం నమోదైంది. మండలంలోని పల్సి గ్రామంలోని లోతట్టు ప్రాంతంలోని సుమారు 15 మంది ఇండ్లలో వరద నీరు చేరింది. సమాచారం అందుకున్న తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సాగర్‌రెడ్డిలు పల్సి గ్రామానికి చేరుకొని పరిశీలించారు.

ముథోల్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రెండు రోజుల నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లో తట్టు ప్రాంతంలో వర్షం నీరు భారీగా చేరింది. మండలంలోని ముద్గల్, వడ్తా ల్ - బోరిగాం గ్రామాల మధ్య ఉన్న లోలెవెల్ వంతెనలపై వర్షం నీరు భారీ గా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. ముథోల్ మండలంలో గురువారం రాత్రి 221.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



శ్మశాన వాటిక వద్ద శివుని విగ్రహ తల మాత్రమే కనిపిస్తున్న దృశ్యం



కుభీర్ మండలంలోని పల్సిలో ఇంట్లోకి చేరిన వరద నీరు



ముథోల్ బస్టాండ్ ఏరియాలో వర్షం నీరు